# జి 20 శిఖరాగ్ర సమావేశం 2019





**సునీల్ ధవళ**
సిఇఒ, ద థర్డ్ అంపైర్ మీడియా, ఫార్మర్ వైస్ ప్రెసిడెంట్ నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

2019 జి 20 శిఖరాగ్ర సమావేశం జపాన్ - ఒసాకా నగరంలోని అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రంలో నిర్వహించారు. గ్రూప్ ఆఫ్ ట్వంటీ(జి 20) పద్నాలుగో శిఖరాగ్ర సమావేశం 2019 జూన్ 28, 29 తేదీలలో తొలిసారి జపాన్‌లో జరిగింది. జపాన్ ప్రధాని షింజో అబే '2019 జి 20' కి అధ్యక్షుడిగా వ్యవహించారు. 2019 జి 20 సదస్సును ఒసాకాలో నిర్వహించాలని 2018 ఏప్రిల్ 10న జి 20 సదస్సు కార్యవర్గం నిర్ణయించింది.

జి 20 పదిహేనో వార్షిక శిఖరాగ్ర సమావేశం 2020 నవంబర్ 21, 22 తేదీల్లో సౌదీ అరేబియాలోని రియాద్‌లో నిర్వహించాలని ప్రస్తుత కార్యవర్గం ఖరారు చేసింది.

## గ్రూప్ ఆఫ్ ట్వంటీ (జి 20)

ప్రపంచంలో ప్రధాన ఆర్థిక వ్యవస్థలుగా అలరారుతున్న 19 దేశాలు, యురోపియన్ యూనియన్ కలసి గ్రూప్ ఆఫ్ ట్వంటీ(జి 20) గా ఏర్పడ్డాయి. సభ్య దేశాల మధ్య అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ప్రాథమిక వేదికగా జి 20 వ్యవహరిస్తోంది.

ప్రపంచ ఆర్థిక ఉత్పత్తిలో 85 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల వాటాను జి 20 సభ్యదేశాలు కలిగి ఉన్నాయి. పరస్పరం సహకరించుకోవడం, ముఖ్యంగా ఆర్థిక అవకాశాలు అందిపుచ్చుకోవడం, సంబంధిత సవాళ్లను కలసికట్టుగా ఎదుర్కోడం తద్వారా ఆర్థిక సమతుల్యత సాధించడం గ్రూప్ ఆఫ్ ట్వంటీ ఉద్దేశం. ఒక్కో దేశం ఏటా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యమిస్తాయి. సమీప భవిష్యత్తులో విధాన రూపకల్పనను ప్రభావితం చేసే విషయాలపై చర్చలు జరుపుతాయి.

## ఆవిర్భావానికి కారణాలు

1997 జూలైలో తూర్పు, ఆగ్నేయాసియాలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా ఇండోనేషియా, దక్షిణ కొరియా, థాయిలాండ్ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి, హాంకాంగ్, జపాన్, లావోస్, మలేషియా, ఫిలిప్పీన్స్ దేశాలు కూడా అత్యంత ప్రభావితమయ్యాయి. అత్యధిక దేశాల కరెన్సీ విలువ బలహీనపడింది, స్టాక్ మార్కెట్ సూచీలు క్షీణించాయి. ఆగ్నేయాసియా నుంచి ఈ సంక్షోభం ఇతర దేశాలకు, ఖండాలకు పాకింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందని అగ్రదేశాలు, ప్రపంచ ప్రధాన ఆర్థికవ్యవస్థలు భయాందోళనకు గురయ్యాయి.

గ్రూప్ 7 సభ్య దేశాలైన కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికాల ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా పెరుగుతోంటే, బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా (బ్రిక్ దేశాలు) వృద్ధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని సంతరించుకోవడంలో బ్రిక్ దేశాలు కీలకంగా మారాయి. అప్పటివరకు జి 7 సభ్యదేశాల నాయకులు బ్రిక్ దేశాలను పెద్దగా పట్టించుకోలేదు, వాటికి ప్రాముఖ్యం ఇవ్వలేదు. ప్రపంచీకరణ తెచ్చిన సవాళ్లు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థ ఏర్పాటు వంటి వాటి ఫలితంగా కూడా బ్రిక్ దేశాల ప్రాముఖ్యం పెరిగింది. జి 7 దేశాల వాణిజ్య, ఆర్థిక అవసరాల్లోనూ బ్రిక్ దేశాలు కీలకంగా మారాయి. వాటి ప్రమేయం, పాత్ర పెంచుకున్నాయి. ముడి ఇనుము, కాఫీ, చెరకు వంటి దిగుమతుల విషయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బ్రెజిల్‌పై ఆధారపడి ఉంది. రష్యా సహజ వాయువుపై ఐరోపా దేశాలన్నీ ఆధారపడ్డాయి. యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా కోసం సింహభాగం వస్తూత్పత్తులు తయారు చేసే దేశంగా చైనా పుంజుకొంది. ఇతర ఉత్పత్తుల ఎగుమతితో పాటూ సాఫ్ట్‌వేర్, హైటెక్ సేవలను అందించే అగ్ర ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించింది.

## ఆవిర్భావం

1997 ఆసియా ఆర్థిక సంక్షోభానికి ప్రతిస్పందనగా గ్రూప్ 7(జి 7) సభ్యదేశాల ఆర్థిక మంత్రులు, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ల సమావేశం 1999లో జరిగింది. ఆర్థిక మార్కెట్ల స్థిరత్వానికి మద్దతు ఇవ్వడానికి, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించడానికి, అభివృద్ధి చెందిన - చెందుతున్న ఆర్థిక వ్యవస్థల నుంచి ఆర్థిక మంత్రులు అలాగే సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లను ఏకతాటిపైకి తీసుకురావడానికి గ్రూప్ 20 ఏర్పరచాలనే ఆలోచనకు బీజం పడింది. అందుకే గ్రూప్ 20 శిఖరాగ్రసభలను అధికారికంగా "సమ్మిట్ ఆన్ ఫైనాన్సియల్ మార్కెట్స్ అండ్ వరల్డ్ ఎకానమీ"(ఆర్థిక మార్కెట్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సదస్సు)గా పిలుస్తారు. మరోపక్క ప్రపంచీకరణ పురోగమిస్తున్న దశలో అవకాశాలతో పాటు వివిధ సమస్యలతో ఆర్థిక వ్యవస్థలు ముడిపడి ఉన్నందున జి 20 శిఖరాగ్ర సభ వేదికకు ప్రాముఖ్యం సంతరించుకొంది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నడుమ అత్యున్నత స్థాయిలో కొత్త ఏకాభిప్రాయ వేదిక అవసరాన్ని అప్పటి కెనడా ప్రధాని పాల్ మార్టిన్ గుర్తించారు.

2008 నవంబర్‌లో సబ్ ప్రైమ్, లెహ్మాన్ బ్రదర్స్ పతనం నేపథ్యంలో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి స్పందనగా ప్రారంభ జి20 దేశ నాయకుల సమ్మిట్ వాషింగ్టన్ డి.సి.లో జరిగింది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ దేశాల ఆర్థిక మంత్రులు, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ల సమావేశానికే అప్పటివరకు పరిమితమైన జి20ని సభ్య దేశాల నాయకుల వేదికగా మార్చారు. ఆ సమావేశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభాలను నివారించడానికి ఒక కార్యాచరణ ప్రణాళికకు అంగీకరించారు. 2009 ఏప్రిల్‌లో లండన్‌లో జి 20 దేశాల నాయకులు రెండోసారి కలుసుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి, ఆర్థిక పరపతి పెంపుదల, ఉద్యోగాలను పునరుద్ధరించడానికి 1.1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించే చారిత్రాత్మక ప్రతిజ్ఞను చేశారు. లండన్‌లో తీసుకున్న నిర్ణయాలను అనుసరించి జి 20 నాయకులు అదే సంవత్సరం 2009 సెప్టెంబరులో, పిట్స్‌బర్గ్(అమెరికా)లో మూడో శిఖరాగ్ర సమావేశం జరిగింది. జి 20ని 'అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ప్రధాన వేదిక'గా మలిచారు.

జి 20 శిఖరాగ్ర సమావేశాలు 2010 వరకు ప్రతి ఆరునెలలకు ఒక సారి జరిగేవి. 2011 నుంచి వార్షిక శిఖరాగ్ర సభలుగా నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో స్థూల ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యంపై మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై విపరీతమైన ప్రభావాన్ని చూపే మౌలికాభివృద్ధి, వాతావరణ మార్పు, ప్రజారోగ్యం, తీవ్రవాద నిరోధకత, వలసదారులు, శరణార్థుల సంక్షేమం వంటి అంశాలపై కూడా జి 20 శిఖరాగ్రాసభల్లో చర్చలు జరుగుతున్నాయి, పరిష్కారానికి కావాల్సిన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

## జి 20 సభ్య దేశాలు

అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో, దక్షిణ కొరియా, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా, యురోపియన్ యూనియన్.

## అతిథి దేశాలు

జి 20 ని అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ప్రధాన వేదికగా అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏటా కనీసం ఆరు అతిథి దేశాల నాయకులను సదస్సులో పాల్గొనడానికి జి 20 అధ్యక్షుడు ఆహ్వానిస్తారు. జి 20 శిఖరాగ్ర సమావేశాలకు ఆహ్వానిత దేశాల నాయకులతో పాటు, వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు జి 20 సభ్యుల నాయకులతో పాటు సదస్సులో పాల్గొంటారు.

ఆ సంవత్సరం ఆసియన్(అసోసియేషన్ ఆఫ్ సౌతీస్ట్ ఏసియన్ నేషన్స్)కు అధ్యక్షత వహించే దేశ ప్రధాని/అధ్యక్షుడు, ఆఫ్రికన్ యూనియన్‌కు అధ్యక్షత వహించే దేశ ప్రధాని/అధ్యక్షుడు, న్యూ పార్టనర్‌షిప్ ఫర్ ఆఫ్రికాస్ డెవలప్‌మెంట్(నెపాడ్)కు అధ్యక్షత వహించే దేశప్రధాని/అధ్యక్షుడు, ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్(అపాక్)కు అధ్యక్షత వహించే దేశ ప్రధాని/అధ్యక్షులను అతిథులుగా ఆహ్వానించడం పరంపరగా కొనసాగుతోంది.

ఆ ఏడు జి 20 ఆతిధ్యమిచ్చే దేశంతో స్నేహపూర్వక సంబంధాలున్న రెండు పొరుగు దేశాల నాయకులను కూడా జి 20 అధ్యక్షుడు ఆహ్వానించారు. కొన్నాళ్ళుగా స్పెయిన్ శాశ్వత ఆహ్వానిత దేశంగా కొనసాగుతోంది.

అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఆసియా అభివృద్ధి బ్యాంకు, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా జి 20 సదస్సులకు ఆహ్వానిస్తారు. జి 20 శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే విదేశీ అతిథులకు దాదాపు 20 వివిధ భాషలలో అనువాద, వ్యాఖ్యాన సేవలను అందిస్తారు.

జి 20కి ఒక్కో సంవత్సరం ఒక్కో సభ్య దేశం అధ్యక్షత వహిస్తుంది. ఆ దేశాధ్యక్షుడు/ప్రధాని జి 20 అధ్యక్షుడుగా సంవత్సర కాలం పాటు కొనసాగుతారు. జి 20 సభ్య దేశం అధ్యక్షతకు పదవీ కాలం ప్రతి ఏటా డిసెంబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది.

## జి 20 ఎంగేజ్మెంట్ గ్రూప్స్

జి 20 సభ్య దేశాలు వివిధ సామాజిక, ఆర్థిక, భౌగోళిక అంశాలకు సంబంధించి సంప్రదింపులు, సలహా సహకారం పొందేందుకు సంబంధిత అంశాలపై చర్చించడానికి నిపుణుల ప్రత్యేక సమూహాలను ఏర్పాటు చేశారు. ఈ నిపుణులు వివిధ జి 20 సభ్య దేశాల పౌరులై ఉంటారు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ, ఆర్థిక, వ్యాపార, రాజకీయ, భౌగోళిక అంశాలను ప్రభావితం చేసే ముఖ్య సమస్యలపై పరస్పరం చర్చించి సంబంధిత సభ్య ప్రభుత్వాలకు సిఫారసులను చేసే నిపుణుల ప్రత్యేక సమూహాలను ఎంగేజ్మెంట్ గ్రూప్స్ అంటారు. ఎంగేజ్మెంట్ గ్రూప్స్ సలహాలను జి 20 శిఖరాగ్ర సభలో చర్చల కోసం వాటిని పరిగణనలోకి తీసుకొంటారు. తద్వారా విధాన రూపకల్పన ప్రక్రియకు అవి దోహద పడతాయి. ఆయితే, ఎంగేజ్మెంట్ గ్రూప్స్ ఇచ్చే సలహాలు, సిఫార్సులకు జి 20 సభ్య దేశాలు కట్టుబడి ఉండనవసరం లేదు. ప్రతి ఎంగేజ్మెంట్ గ్రూప్‌నకు జి 20 ఆతిధ్య దేశం అధికారికంగా నియమించిన సంస్థలు లేదా వ్యక్తులు అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం ఏడు అధికారిక ఎంగేజ్మెంట్ గ్రూప్స్ ఉన్నాయి. అవి

- బిజినెస్ 20
- సివిల్ 20
- లేబర్ 20
- సైన్స్ 20
- థింక్ 20
- విమెన్ 20
- యూత్ 20

మూడు ఎంగేజ్మెంట్ గ్రూప్స్‌ను ఏర్పాటు చేశారు. అవి

- జి 20 యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అలయన్స్
- గర్ల్స్ 20
- అర్బన్ 20

## జి20లో భారతదేశం ప్రాముఖ్యం

బ్రిటన్‌ని అధిగమించి ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఎదిగింది. ఈ నేపథ్యంలో జి 20లో అతి ముఖ్యమైన సభ్య దేశంగా భారతదేశం రూపుదిద్దుకుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు దోహదం చేసే, సమగ్ర అభివృద్ధికి రూపకల్పనకు తోడ్పడే, స్థిరీకరణను ప్రభావితం చేయగల దేశంగా అవతరించింది. జి 20 శిఖరాగ్ర సభల చర్చలలో బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మకంగా పాల్గొంటోంది. అయిదేళ్లుగా జి 20 శిఖరాగ్ర సమావేశాల్లో ప్రతిష్ఠాత్మక బహుముఖ ఎజెండాను భారతదేశం ప్రవేశపెట్టింది. జి 20 శిఖరాగ్ర సమావేశంలో భారతదేశం దేశం వాణిజ్యం, పెట్టుబడులతో పాటు పేదరిక నిర్మూలన, స్థిరమైన అభివృద్ధి కోసం ప్రయత్నిస్తోంది. ప్రపంచ మిగులును ఉపయోగించి మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమగ్ర అభివృద్ధి, ఇంధన సామర్థ్యం, ఉపాధికల్పన, స్థిరమైన ఆర్థిక మార్కెట్లు ఉగ్రవాదాన్ని అణచివేయడం, నల్లధనాన్ని వెలికితీయడానికి సహకారం వంటి అంశాలతో కూడిన అజెండా సమర్పించింది.

2015 జి 20 సదస్సులో భారతదేశం, ఇతర బ్రిక్స్ భాగస్వాములతో కలిసి, షాంఘైలో ప్రధాన కార్యాలయంగా భారత అధ్యక్షుడి నేతృత్వంలోని న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డిబి) ను ప్రారంభించడానికి కృషి చేసింది.

2018 జి20 సదస్సులో దేశం విడిచి పారిపోయిన ఆర్థిక నేరగాళ్ళపై కఠినంగా వ్యవహరించడానికి బలమైన క్రియాశీల సహకారం కోసం జి 20 దేశాలకు భారత్ పిలుపునిచ్చింది. భారతదేశం సమర్పించిన తొమ్మిది పాయింట్ల ఎజెండాలో అంతర్జాతీయ వాణిజ్యం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, అంతర్జాతీయ పన్ను వ్యవస్థలు ప్రధానంగా ఉన్నాయి. దేశం విడిచి పారిపోయిన ఆర్థిక నేరగాళ్ళకు ఇతర దేశాలలో ప్రవేశం కలిపించి ఆశ్రయం కల్పించడాన్ని తిరస్కరించే యంత్రాంగాన్ని రూపొందించడానికి జి 20 దేశాల ఉమ్మడి ప్రయత్నాలను కూడా భారత్ కోరింది. అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ ఎగెనెస్ట్ ట్రాన్స్‌నేషనల్ ఆర్గనైజ్డ్ క్రైమ్ లో ముఖ్యంగా అంతర్జాతీయ సహకారానికి అన్ని దేశాలు పూర్తి మద్దతునిచ్చిన కన్వెన్షన్ సమర్థంగా అమలు చేయాలని కోరింది.

మనీలాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ సమగ్రతకు ముప్పు కలిగే చర్యలు, సంబంధిత బెదిరింపులను ఎదుర్కోవడానికి 1989లో స్థాపించబడిన ఒక అంతర్ ప్రభుత్వ సంస్థ అయిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పరిధి విస్తృతం చేయాలంది. అంతేకాక ప్రామాణికమైన ఆర్థిక విధానాల సమితిని అభివృద్ధి పరచి, ఇంటెలిజెన్స్ యూనిట్ల మధ్య సమయానుసారంగా సమగ్రమైన సమాచార మార్పిడికి దారితీసే అంతర్జాతీయ సహకారాన్ని మెరుగుపర్చడానికి ప్రాధాన్యం ఇవ్వాలని భారతదేశం సూచించింది.

# గ్లాస్ ఊలు అంటే...?

## జీ20 సదస్సు - 2019



జపాన్‌లోని ఒసాకాలో జూన్ 28న ప్రారంభమైన జీ20 సభ్యదేశాల సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబేతో త్రైపాక్షిక చర్చల్లో ప్రధాని పాల్గొన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతం, మౌలిక వసతుల అభివృద్ధిలో మెరుగైన సహకారంపై ఈ సమావేశంలో చర్చించినట్లు మోదీ తెలిపారు.

### 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు-2019'

నర్సింగ్ వృత్తిలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారంగా భావించే 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు-2019' తెలంగాణకు చెందిన అస్కా సలోమికి లభించింది. కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా పురస్కార గ్రహీతల జాబితాను విడుదల చేసింది. అస్కా సలోమీ 2009లో గాంధీ నర్సింగ్ కళాశాల నుంచి ప్రధానాచార్యులుగా పదవీ విరమణ పొందారు.

## కరెంట్ అఫైర్స్



### భారత కెప్టెన్ కోహ్లి మరో రికార్డు

టీమ్ ఇండియా సారథి కోహ్లి తాజాగా మరో ఘనత సాధించాడు. దిగ్గజ ఆటగాళ్లు సచిన్ తెందుల్కర్, బ్రయాన్ లారాల పేరిట ఉన్న ఉమ్మడి రికార్డును అధిగమించి, అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 20 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. 417 ఇన్నింగ్స్‌ల్లో విరాట్ ఈ ఘనత సాధించాడు. సచిన్, లారా ఇద్దరూ 453 ఇన్నింగ్స్‌ల్లోనే 20 వేల క్లబ్‌లోకి అడుగుపెట్టడం విశేషం. వన్డేల్లో 232 మ్యాచ్‌లాడి 11,159 పరుగులు చేసిన కోహ్లి 77 టెస్టుల్లో 6613 పరుగులు, 67 టీ20ల్లో 2263 పరుగులు సాధించాడు.

### అబ్బూరి ఛాయాదేవి కన్నుమూత

ప్రముఖ తెలుగు కథా రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అబ్బూరి ఛాయాదేవి (83) అనారోగ్యం కారణంగా జూన్ 28న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఛాయాదేవి 1933 అక్టోబరు 13న రాజమహేంద్రవరంలో జన్మించారు.

ఆమె భర్త అబ్బూరి వరదరాజేశ్వరరావు కూడా ప్రముఖ తెలుగు రచయిత. 1951-53 మధ్య నిజాం కళాశాలలో ఎం.ఏ. పూర్తి చేసిన ఛాయాదేవి స్త్రీవాద రచయిత్రిగా పేరుగాంచారు. ఆమె రాసిన 'బోన్‌సాయ్ బ్రతుకు ' అనే కథను 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో చేర్చింది. 2005లో 'తనమార్గం' అనే కథాసంకలనానికి ఛాయాదేవికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

### మరికొన్ని...

- ప్రపంచకప్‌లో భాగంగా జూన్ 27న వెస్టిండీస్‌తో మాంచెస్టర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 125 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 269 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ జట్టు షమి (4/16), బుమ్రా (2/9), చాహల్ (2/39)ల ధాటికి 143 పరుగులకే కుప్పకూలింది. మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.
- పిల్లలను బడికి పంపించే తల్లులకు ఏడాదికి రూ.15వేలు ఇచ్చే అమ్మఒడి పథకాన్ని ఇంటర్ విద్యార్థులకూ వర్తింపజేయాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెల్ల రేషన్‌కార్డులు కలిగి, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులెవరైనా ఈ పథకానికి అర్హులే.
- శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ - షార్ సంచాలకులుగా ఆర్ముగం రాజరాజన్ నియమితులయ్యారు. ఎస్. పాండ్యన్ స్థానంలో ఈ నియామకం జరిగింది. ఆర్ముగం రాజరాజన్ ప్రస్తుతం తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో స్ట్రక్చర్స్, పీఎస్ఆర్వో విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

మరింత సమాచారం www.eenadupratibha.net లో

## నిత్యజీవితంలో రసాయనశాస్త్రం

**1.** పొడిమంచు అని దేన్ని అంటారు?
1) ద్రవస్థితిలోని కార్బన్ డైఆక్సైడ్
2) వాయుస్థితిలోని కార్బన్ డైఆక్సైడ్
3) ఘనస్థితిలోని కార్బన్ డైఆక్సైడ్
4) అన్నీ

**2.** విగ్రహాల తయారీ, విరిగిన ఎముకలను కట్టు కట్టడానికి ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన నామం?
1) కాల్షియం సల్ఫేట్
2) కాల్షియం సల్ఫేట్ హెమీ హైడ్రేట్
3) మెగ్నీషియం సల్ఫేట్
4) కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్

**3.** కెంపు (రూబి) రత్నం ఏ లోహ సమ్మేళనం?
1) రాగి 2) అల్యూమినియం
3) పాదరసం 4) ప్లాటినం

**4.** లాఫింగ్ గ్యాస్ రసాయన నామం?
1) నైట్రస్ ఆక్సైడ్ 2) నైట్రిక్ ఆక్సైడ్
3) నైట్రోజన్ పెంటాక్సైడ్ 4) నత్రజని

**5.** సోడా తయారీలో నీటిలో కరిగించే వాయువు?
1) సల్ఫర్ డైఆక్సైడ్
2) కార్బన్ డైఆక్సైడ్
3) కార్బన్ మోనాక్సైడ్ 4) చక్కెర

**6.** నిప్పును ఆర్పే యంత్రం (Fire Extinguisher) లోని రసాయన పదార్థాలు విడుదల చేసే వాయువు?
1) నత్రజని 2) కార్బన్ డైఆక్సైడ్
3) హైడ్రోజన్ 4) మీథేన్



రచయిత
పి. భానుప్రకాష్
విషయనిపుణులు

**7.** హిమోగ్లోబిన్‌లో ఉండే లోహ అయాన్?
1) ఇనుము 2) రాగి
3) వెండి 4) మెగ్నీషియం

**8.** విటమిన్ - B12లో ఉండే లోహ అయాన్ ఏది?
1) రాగి 2) సోడియం
3) పొటాషియం 4) కోబాల్ట్

**9.** కాయలను కృత్రిమంగా పక్వానికి తెచ్చేందుకు ఉపయోగించే వాయువు?
1) మీథేన్ 2) ఈథేన్
3) ఇథిలీన్ 4) బ్యూటేన్

**10.** కృత్రిమ వర్షాన్ని సృష్టించడానికి ఉపయోగించే రసాయన సమ్మేళనం ఏది?
1) సిల్వర్ అయోడైడ్ 2) పొడిమంచు
3) మెగ్నీషియం అయోడైడ్ 4) 1, 2

**11.** జిప్సం రసాయన నామం?
1) కాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్
2) కాల్షియం సల్ఫేట్ డైహైడ్రేట్
3) కాల్షియం ఫాస్ఫేట్
4) కాల్షియం క్లోరైడ్

**12.** సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ అనేది ఏ పదార్థాల మిశ్రమం?
1) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్ + జిప్సం
2) కాల్షియం ఫాస్ఫేట్ + జిప్సం
3) కాల్షియం కార్బొనేట్ + జిప్సం
4) కాల్షియం క్లోరైడ్ + జిప్సం

**13.** విద్యుత్ శక్తిని నిల్వ ఉంచే ఆమ్ల నిక్షేప ఘటంలో ఉపయోగించే ఆమ్లం ఏది?



## ఆర్ఆర్‌బీ పరీక్షల ప్రత్యేకం

### జనరల్ సైన్స్

1) నత్రికామ్లం 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
3) ఎసిటిక్ ఆమ్లం 4) సల్ఫ్యూరిక్ ఆమ్లం

**14.** కిందివాటిలో ఓజోన్‌కు సంబంధించి సరికానిది?
i) ఓజోన్ వాయువు అణు ఫార్ములా $O_3$
ii) ఇది వాతావరణంలోని స్ట్రాటో ఆవరణంలో ఉంటుంది.
iii) దీన్ని క్రిమిసంహారిణిగా ఉపయోగిస్తారు.
iv) ఇది అతినీలలోహిత కిరణాలను శోషించుకోదు.
1) i, iv 2) ii, iv
3) iv మాత్రమే 4) iii, iv

**15.** కిందివాటిని జతపరచండి.

| పదార్థం | రసాయన ఫార్ములా |
|---|---|
| a) ఫాస్‌జీన్ | i) $Ca(OCl)_2$ |
| b) బాష్ప వాయువు | ii) $COCl_2$ |
| c) బ్లీచింగ్ పౌడర్ | iii) $CCl_3NO_2$ |

1) a-i, b-ii, c-iii 2) a-ii, b-i, c-iii
3) a-iii, b-i, c- ii 4) a-ii, b-iii, c-i

**16.** చెరుకు రసం నుంచి చక్కెరను స్ఫటికీకరించిన తర్వాత మిగిలే మాతృ ద్రవాన్ని ఏమంటారు?
1) మొలాసిస్ 2) మిథనాల్
3) మిథైలేటెడ్ స్పిరిట్ 4) రెక్టిఫైడ్ స్పిరిట్

**17.** రసాయనికంగా వంటసోడా అంటే?
1) సోడియం కార్బొనేట్
2) సోడియం బైకార్బొనేట్
3) సోడియం క్లోరైడ్
4) పొటాషియం కార్బొనేట్

**18.** కృత్రిమ సిల్క్ అని దేన్ని పిలుస్తారు?
1) ఓజోన్ 2) టెఫ్లాన్
3) రేయాన్ 4) నైలాన్

**19.** 35 - 40 శాతం గల ఫార్మాల్డిహైడ్ జల ద్రావణాన్ని ఏమంటారు?
1) ఫార్మలిన్ 2) ఫార్మాల్డిహైడ్
3) మెటాల్డిహైడ్ 4) ఎసిటాల్డిహైడ్

**20.** జీవరసాయన నమూనాలను నిల్వ చేయడానికి ఉపయోగించేది?
1) వెనిగర్ 2) ఫార్మలిన్
3) అమాల్గమ్ 4) బెంజీన్

#### సమాధానాలు

1-3; 2-2; 3-2; 4-1; 5-2; 6-2; 7-1; 8-4; 9-3; 10-4; 11-2; 12-1; 13-4; 14-3; 15-4; 16-1; 17-2; 18-3; 19-1; 20-2.

## గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

**1.** మంచు కరుగుతున్నప్పుడు దాని ఉష్ణోగ్రత? (ఏపీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్స్, 2017)
1) నిలకడగా ఉండదు 2) పెరుగుతుంది
3) తగ్గుతుంది 4) స్థిరంగా ఉంటుంది

**2.** నీటి సాంద్రత ఏ ఉష్ణోగ్రత వద్ద అత్యధికంగా ఉంటుంది? (అసిస్టెంట్ ఇంజినీర్స్, ఏపీఆర్‌డబ్ల్యూఎస్ - 2013)
1) 0°C 2) 32°C 3) –4°C 4) 4°C

**3.** కెల్విన్ కొలమానాన్ని దేన్ని కొలవడానికి ఉపయోగిస్తారు? (ఏపీపీఎస్సీ గ్రూప్ 2, 2012)
1) కాంతి శక్తి 2) ఉష్ణోగ్రత
3) ధ్వని తీవ్రత 4) ఉష్ణశక్తి

**4.** పర్వతాల మీద ఏ ఉష్ణోగ్రత వద్ద నీరు మరుగుతుంది? (ఏపీపీఎస్సీ హెచ్ఎండబ్ల్యూఎస్ ఇంజినీర్స్, 2012)
1) 100°C కంటే తక్కువ
2) 100°C కంటే ఎక్కువ
3) 100°C 4) ఏదీకాదు

**5.** విలువైన రత్నం కెంపులో ప్రధానంగా అల్యూమినియం ఆక్సైడ్‌తో పాటు స్వల్పంగా ఉండే పదార్థం? (ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2012)
1) వెండి 2) మాంగనీస్
3) క్రోమియం 4) కోబాల్ట్

**6.** గన్‌కాటన్ పేరుతో పిలిచే శక్తిమంతమైన విస్ఫోటనాకారి? (ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2012)
1) పొటాషియం క్లోరైడ్
2) సెల్యులోజ్ నైట్రేట్
3) పొటాషియం నైట్రేట్
4) సెల్యులోజ్ ఎసిటేట్

**7.** గ్లాస్ ఊలు అంటే? (ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2012)
1) గాజు, ఉన్ని మిశ్రమం
2) పారదర్శకత కలిగిన ఉన్ని
3) పొడి చేసిన గాజు
4) అతి సన్నటి గాజు తంతువులు

#### సమాధానాలు

1-4, 2-4, 3-2, 4-1, 5-3 6-2 7-4

Eenadu epaper